క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చండూరు(గట్టుపల్) : గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వీరమల్ల శ్రీశైలం ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన పలు పార్టీల కార్యకర్తలు ఆదివారం మునుగోడులో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

స్నేహితురాలి కూతురు వివాహానికి చేయూత

చిట్యాల: తమతో కలిసి చదువుకున్న స్నేహితురాలి కూతురు వివాహానికి ఆర్థిక చేయూత అందించి అండగా నిలబడ్డారు ఆమెతో కలిసి చదువుకున్న స్నేహితులు. వివరాలు.. చిట్యాల పట్టణానికి చెందిన కసిరెడ్డి ప్రభ కూతురు శ్రీజ వివాహం ఆదివారం జరిగింది. వివాహ ఖర్చులకుగాను ప్రభతో కలిసి చదువుకున్న 1995–96 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.26,500, ఇంటర్ స్నేహితులు రూ.68,964 అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మూడ వెంకటాద్రి, అమరోజు దయానంద్, జొర్రిగల జ్యోతి, పెద్దగోని మాధవి, మూడ ఉమారాణి, రేపాక సత్యనారాయణ, జమాండ్ల నర్సిరెడ్డి, భాగ్యమ్మ, గుంటోజు అనంతాచారి, సుజాత, వెంకన్న, ప్రభావతి, జ్యోతి, జయమ్మ, కుమారస్వామి, అనిత, లింగయ్య, వినయ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు సన్మానం



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న శివశంకర్‌రెడ్డి

చిట్యాల: మున్సిపాలిటీలోని పదో వార్డు అంబేద్కర్ నగర్‌లో నూతనంగా శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించి శ్రీరామనవమి రోజు విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. దీంతో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులను ఆదివారం పట్టణంలోని శ్రీ కనకదుర్గ ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు బొబ్బిలి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు.

29 నుంచి సాయి మందిర వార్షికోత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 29 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న 17వ ఆలయ వార్షికోత్సవం, శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి నవమి వార్షికోత్సవానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్య, ట్రస్ట్ కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి ఉప్పల వెంకటరమణ, ప్రతినిధులు బాణాల రాంరెడ్డి, వలిశెట్టి స్వప్న, రాంబాబు, గోవిందరాజులు, వేణుగోపాల్, దాచేపల్లి శ్రీనివాస్, దేవరశెట్టి మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 23న హనుమాన్ శోభాయాత్ర

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలో ఈనెల 23న హనుమాన్ విజయోత్సవ శోభాయాత్రను వైభవంగా నిర్వహిస్తున్నామని శ్రీ పాటిమీది భక్తాంజనేయస్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు సందగళ్ల నాగరాజుగౌడ్, ప్రధానకార్యదర్శి ఊడుగు రమేష్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ఆలయం నుంచి యాత్ర ప్రారంభమై తంగడపల్లి రోడ్డు, జాతీయ రహదారి, చిన్నకొండూర్ రోడ్డు మీదుగా శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాలి

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్ అన్నారు. ఈ నెల 27 నుంచి 30 వరకు కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్న పోటీల కోసం ఆదివారం నల్లగొండలోని అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పట్టుదలతో రాణిస్తే అంతర్జాతీయ స్థాయికి ఎదగవచ్చన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

- శాలిగౌరారం మండలంలో 14 కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటి వరకు 93,375.60 క్వింటాళ్ల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాల్లో రూ. 14.52 కోట్లు జమ



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

శాలిగౌరారం: ప్రస్తుత యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ శాలిగౌరారం మండలంలో ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో ఐకేపీ ఆధ్వర్యంలో 8, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4, ఎఫ్‌పీఓ(రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య) ఆధ్వర్యంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఆకారం, భైరవునిబండ, చిత్తలూరు, గురుజాల, రామాంజాపురం, ఎన్‌జీ కొత్తపల్లి, తుడిమిడి, ఇటుకులపహాడ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, అడ్లూరు, మాధారంకలాన్, ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో శాలిలింగోటం, పెర్కకొండారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

1412 మంది రైతుల నుంచి..

శాలిగౌరారం మండలంలోని 14 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1412 మంది రైతుల నుంచి 93,375.60 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ. 20.57 కోట్లు ఉండగా అందులో 1004 మంది రైతులకు రూ.14.52 కోట్లు బ్యాంకు ఖాతాలో జమ చేశారు. అందులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 463 మంది రైతులకు రూ.5.63 కోట్లు, ఐకేపీ ఆధ్వర్యంలో 431 మంది రైతులకు రూ.6.89 కోట్లు, ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో 110 మంది రైతులకు రూ.2 కోట్లు జమ చేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా మండలంలోని ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సుమారు 45 వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు ఉన్నాయి. అందులో పీఏసీఎస్ కేంద్రాల్లో 16 వేల క్వింటాళ్లు, ఐకేపీ కేంద్రాల్లో 25 వేల క్వింటాళ్లు, ఎఫ్‌పీఓ కేంద్రాల్లో నాలుగు వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు ఉన్నాయి.

17,500 ఎకరాల్లో వరిసాగు

వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం మండలంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో మొత్తం 17,500 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులు ఎండిపోవడంతో 2 వేల ఎకరాల్లో వరిపంట పూర్తిగా ఎండిపోగా తెగుళ్లు, రోగాలతో పంటలు అత్యధికంగా దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు 2.50 లక్షల క్వింటాళ్లకు పైగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 93,375.60 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు జరుగగా మరో 45 వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు ఉన్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొంత ఆలస్యంగా ప్రారంభం కావడంతో అనేకమంది రైతులు తక్కువ ధరకు వేల క్వింటాళ్ల పచ్చి ధాన్యం రైస్‌మిల్లులకు అమ్ముకున్నారు.

సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తున్నాం



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో చిన్నచిన్న సమస్యలు ఏర్పడుతున్నా వాటిని వెంటనే పరిష్కరిస్తున్నాం. ఎండల కారణంగా కొనుగోలుకు అంతరాయం ఏర్పడుతోంది. కొనుగోలు జరిగిన తర్వాత బిల్లులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో కొంత సమస్యలను ఎదుర్కొంటున్నాం. రైతుల భూ వివరాల నమోదు, పంటల సాగు నమోదులో ఆన్‌లైన్ సమస్యలు ఉన్నప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు సమస్యను పరిష్కరిస్తుండడంతో వెంటవెంటనే బిల్లులు చేసి రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు పడేలా చేస్తున్నాం.

–నిమ్మల ఆంజనేయులు, సీఈఓ, పీఏసీఎస్ శాలిగౌరారం

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి

కనగల్: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి ఆదివారం రాత్రి కనగల్ ఎక్స్‌రోడ్ వద్ద రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ బీజేపీతో తెలంగాణకు న్యాయం జరగదన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. కృష్ణారెడ్డిని గెలిపిస్తే నల్లగొండను అభివృద్ధిపథంలో తీసుకెళ్తారని అన్నారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్యులపై భారం మోపిందన్నారు. అంతకుముందు బీఆర్‌ఎస్ కార్యకర్తలు నాయకులు బాణాసంచా పేల్చి వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, విజయసింహారెడ్డి నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కనగల్ ఎంపీపీ ఎస్‌కే కరీం పాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, సింగిల్ విండో చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రామగిరి శ్రీధర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్ మహిళా అధ్యక్షురాలు మర్రి రేణుక, వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు



పూజలు చేస్తున్న అర్చకులు

మర్రిగూడ: మండలంలోని రాజాపేటతండా గ్రామ పంచాయతీ పరిధి పద్మశాలికాలనీలో గల శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వట్టిపల్లి మాజీ ఎంపీటీసీ రమావత్ భీమానాయక్–లలిత దంపతులు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు రూ.లక్ష విరాళం అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కోటేష్, రాజేందర్, ఈశ్వర్, జయప్రసాద్, రవి, రాపోలు యాదగిరి, పెద్దయ్య, నాయకులు నూన్సావత్ బిచ్చునాయక్, మారగోని వెంకటయ్య, గోపినాయక్, కొడాల అల్వాల్‌రెడ్డి, కర్నాటి శ్రీకాంత్, మారగోని సుధీర్, జింకల శేఖర్, కొండల్, రాజునాయక్, లక్ష్మణ్‌నాయక్, పెద్దులు, నరేష్, దశరథ, నరేష్‌నాయక్, విజయ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెరువు మట్టి రవాణా

మాడుగులపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో చెరువు మట్టిని కొందరు అక్రమంగా రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ధర్మాపురం, కన్నెకల్లు, చెరువుపల్లి, తోపుచర్ల గ్రామాల్లోని చెరువుల్లో గతంలో మట్టిని తవ్వి డంపు చేసి గుట్టు చప్పుడు కాకుండా ఇటుక బట్టీలకు తరలించినా అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఆదివారం ఆగామోత్కూర్ ఆవాసం చిన్నగూడెం చెరువులో కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో మట్టిని తవ్వి తరలిస్తుండడంతో స్థానికులు మీడియాకు సమాచారం అందించారు. ఈ విషయంపై నీటిపారుదల ఏఈని వివరణ కోరగా రైతులు అనుమతితో తమ పొలాలకు మట్టిని తరలించుకుంటున్నారని తెలిపారు.

జహంగీర్‌ను గెలిపించాలని ప్రచారం



కట్టంగూర్ : బొల్లేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



చిట్యాల: ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ స్వరూప, సీపీఎం నాయకులు



నార్కట్‌పల్లి : ప్రచారం చేస్తున్న నాయకులు



కేతేపల్లి: కొప్పోలు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రచారం చేస్తున్న నాయకులు

నకిరేకల్ : సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామంలో ఆదివారం సీపీఎం నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కందాల ప్రమీల, రాచకొండ వెంకట్‌గౌడ్, మర్రి వెంకటయ్య, కొప్పుల అంజయ్య, మర్రి బక్కయ్య, దొరేపల్లి ఎల్లయ్య, మర్రి ఎల్లయ్య, యేసు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని వెలిమినేడు గ్రామంలో ఆ గ్రామ ఎంపీటీసీ దేశబోయిన స్వరూపనర్సింహ ఆదివారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అదేవిధంగా పిట్టంపల్లి గ్రామంలో సీపీఎం మండల కార్యదర్శి అర్రూరి శ్రీను ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చిట్యాలలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ఆధ్వర్యంలో సీఐటీయూ రైస్‌మిల్లర్స్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించి సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం గ్రామ కార్యదర్శులు పంది నరేష్, మెట్టు పరమేష్, నాయకులు మెట్టు నర్సింహ, శిల్ప, గోపాల్, కిరణ్‌కుమార్, శంభయ్య, సాయికిరణ్, నాగయ్య, నారాయణరెడ్డి, శంకరయ్య, మల్లేశం పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

నార్కట్‌పల్లి : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ సీపీఐఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌ఆర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయన్న, ఆమనగంటి ఐలయ్య, మంద గోపాల్ పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చిన్నపాక లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం బొల్లేపల్లి, పెరిందేవిగూడెం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి సత్తయ్య, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, అద్దంకి నర్సింహ, కట్ట బక్కయ్య, సురేష్, లింగయ్య, యాదయ్య, రాములు పాల్గొన్నారు.

కేతేపల్లి మండలంలో..

కేతేపల్లి: నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు కోరారు. ఆదివారం మండలంలోని కొప్పోలు గ్రామంలో సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులను, హమాలీలను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా చిన వెంకులు మాట్లాడుతూ జహంగీర్‌ను గెలిపిస్తే భువనగిరి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బోళ్ళ నర్సింహారెడ్డి, పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు ఎల్.రాజు, కర్ర బాలయ్య, శ్రీనతి వెంకన్న, గాదె సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీగా తరలిన నాయకులు

కేతేపల్లి: భువనగిరిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఆదివారం కేతేపల్లి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వాహనాల్లో కేతేపల్లికి చేరుకుని ర్యాలీగా భువనగిరి వెళ్లారు.

చండూరు : భువనగిరిలో సీఎం సభకు చండూరు మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం ఆధ్వర్యంలో ఆదివారం భారీగా తరలి వెళ్లారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు కార్యకర్తలు ముందుగా చండూరు మున్సిపల్ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

వంతెన లేక ప్రయాణికుల అవస్థలు

- నకిరేకల్– చందుపట్ల దారిలో లో లెవల్ కాజ్‌వే
- వర్షాలు వస్తే రెండు నెలలపాటు రాకపోకలకు ఇబ్బందులు
- గతంలో ప్రతిపాదనలు పంపినా లభించని మోక్షం



చందుపట్లకు వెళ్లే ప్రధాన దారిలో లోలెవల్ కాజ్‌వే వద్ద వరద నీటి ప్రవాహం(ఫైల్)

నకిరేకల్ : ప్రతి ఏడాది వర్షాకాలం వస్తే చాలు వరద నీటి ప్రవాహంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్య మూడు దశాబ్దాలకు పైగానే ఉన్నా పాలకులు పరిష్కార మార్గాలు చూపడం లేదు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంతోపాటు మరో ఏడు గ్రామాలకు వెళ్లే ప్రధాన దారిలో లోలెవల్ కాజ్‌వే వద్ద ప్రతి ఏటా వర్షాకాలంలో వరద నీటి ప్రవాహంతో ఎనిమిది గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు

చందుపట్ల వంతెన సమీపంలో నకిరేకల్ నుంచి చందుపట్లకు వెళ్లేదారిలో ఈ లోలెవల్ కాజ్‌వే ఉంది. కాజ్‌వే మీదుగా ఎగువన కాకతీయుల కాలం నాటి రాసముద్ర చెరువు ఉంది. ఈ చెరువు అధిక వర్షాలు వచ్చినప్పుడు రెండు మాసాలపాటు నిరంతరం అలుగుపోస్తుంది. దీంతో చందుపట్ల గ్రామ ప్రజలతో పాటు, కందిమల్లవారిగూడెం, పాదువారిగూడెం, మండలాపురం, యల్లమ్మగూడెం, చెర్కుపల్లి, బండపాలెం, ఇనుపాముల గ్రామాలకు ఈ దారి గుండా రాకపోకలు నిలిచిపోతాయి. ఆయా గ్రామాల ప్రజలు ప్రతి నిత్యం ఈదారి గుండా నకిరేకల్ పట్టణానికి రాకపోకల సాగిస్తుంటారు. వర్షాకాలంలో అలుగుపోస్తుండడం వల్ల ప్రయాణాలకు ఆటంకం ఏర్పడుతోంది. ఇక్కడ రూ.90 లక్షల అంచనాతో వంతెన నిర్మాణం కోసం గతంలో అధికారులు గత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయినప్పటికీ వంతెన నిర్మాణానికి మోక్షం లభించలేదు. పాలకులు స్పందించి చందుపట్ల దారిలో ఉన్న లోలెవల్ కాజ్‌వేపై వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలకు కోరుతున్నారు.

కూలీలు ప్రమాదాలబారిన పడుతున్నారు



మా గ్రామం నుంచి బయటకు వెళ్లాలన్నా ఈ దారే దిక్కు. ప్రతి ఏటా వర్షాకాలంలో మా గ్రామంలోని రాసముద్రం చెరువు అలుగు పారుతుంటుంది. దీంతో దారిలో ఉన్న చిన్న కాజ్‌వేపై వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. వరద పారే సమయంలో చిన్న చిన్న వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. కూలీలు కాజ్‌వే దాటే క్రమంలో ప్రమాదాలబారిన పడుతున్నారు. పాలకులు స్పందించి ఇక్కడ వంతెన నిర్మాణం చేయాలి.

–ఇమడపాక లక్ష్మి, ఎంటీపీసీ, చందుపట్ల

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి



నకిరేకల్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి



చిట్యాల: వెలిమినేడులో ఓట్లు అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాల: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం మండలంలోని వెలిమినేడు గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. బీజేపీ జిల్లా నాయకులు అంశల అనిల్‌కుమార్, వెల్ది రాఘవరెడ్డి, వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ చందంపల్లి గ్రామంలో బీజేపీ మండల శాఖ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బడిగె సైదులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు సుమారు 30 మంది బీజేపీ నేత కొండేటి శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మన్నెం రామకృష్ణ, కొమ్మనబోయిన గిరి, మంగదుడ్ల జానయ్య, రంగోజు విజయ్‌చారి, కరుణాకర్, కొండేటి రవీందర్, శ్రీశైలం, మహేష్, వలిశెట్టి వెంకటేష్, చిత్తలూరు శివ, చెట్టిపల్లి నాగయ్య, కుంచెం ఇద్దయ్య, రాంపల్లి గణేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా హనుమత్ గాయత్రీ యజ్ఞం



ఆంజనేయ స్వామి విగ్రహానికి అభిషేకం చేస్తున్న భక్తులు

రామగిరి (నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం కోటయ్య గురుస్వామి ఆధ్వర్యంలో హనుమత్ గాయత్రీ యజ్ఞం, అభిషేకం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ మాల దీక్ష స్వాములు అభిషేకం, గాయత్రీ యజ్ఞం నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, బొల్ల నాగరాజు, గద్దం భరత్, శివకుమార్, హనుమాన్ దీక్ష స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

నల్లగొండ: పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాన్ని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధురాలిని కుమార్తెకు అప్పగింత

మాడుగులపల్లి : మతిస్థిమితం కోల్పోయి ఇంట్లో నుంచి తప్పిపోయిన వృద్ధురాలిని స్థానికుల సాయంతో మాడుగులపల్లి పోలీసులు చేరదీసి ఆమె కుమార్తెకు అప్పగించారు. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన గోరంట్ల పుల్లమ్మకు (70) మతిస్థిమితం లేదు. నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వచ్చి తప్పిపోయి మాడుగులపల్లి మండల కేంద్రానికి చేరింది. శనివారం దీనంగా ఓ వీధిలో సంచరిస్తుండడంతో స్థానికులు చేరదీసి భోజనం పెట్టి మాట్లాడించే ప్రయత్నం చేశారు. తన పేరు పుల్లమ్మ అని వెంకటాద్రిపాలెం గ్రామమని చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వృద్ధురాలికి పోలీస్ స్టేషన్ స్వీపర్ ఇంట్లో తాత్కాలికంగా ఆశ్రయం కల్పించారు. ఆమె చెప్పిన వివరాల ప్రకారం ఎస్‌ఐ శోభన్‌బాబు చిరునామా ఆరా తీసి కుమార్తె జాల సైదమ్మకు సమాచారం ఇచ్చారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కుమార్తె సైదమ్మకు ఏఎస్‌ఐ జాఫర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ వృద్ధురాలిని అప్పగించారు.



వృద్ధురాలిని అప్పగిస్తున్న కానిస్టేబుల్